అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చందర్‌నాయక్

నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న గిరిజన నాయకులు

నవాబ్‌పేట, నవంబర్ 18 : అక్రమ అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేని ఎల్ హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి విస్లావత్ చందర్‌నాయక్ అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని లంబాడీలకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై నిరసన తెలియజేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న గిరిజన నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా చందర్‌నాయక్ మాట్లాడుతూ అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కొడంగల్‌లో తమ జాతి బిడ్డల భూములు లాక్కోవడమే కాకుండా అన్యాయంగా, అక్రమంగా కేసులు పెట్టి అవస్థలపాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు లింబ్యానాయక్, ప్రేమ్‌కుమార్‌నాయక్, చందునాయక్, దేశ్యానాయక్, రాంచందర్‌నాయక్, సేవ్యానాయక్, కోట్యానాయక్, నార్యానాయక్, లస్కర్‌నాయక్, రమేశ్‌నాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

గిరిజనుల అరెస్ట్ సరికాదు

భూత్పూర్, నవంబర్ 18 : కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాలకు తరలివెళ్తున్న గిరిజన సంఘం మండల నాయకులను పోలీసులు సోమవారం ముందుస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు రామురాథోడ్ మాట్లాడుతూ దుద్యాలలో సీఎం రేవంత్‌రెడ్డి ఎలాంటి జీవో లేకుండా గిరిజనుల భూములను లాక్కోవడం సరికాదన్నారు. ఎస్టీ కమిషన్ దుద్యాలకు వస్తున్న సందర్భంగా విషయాన్ని శాంతి యుతంగా ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్తామని ప్రయత్నం చేస్తుండగా అక్రమంగా అరెస్ట్ చేయడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శంకర్‌నాయక్, ఆంజనేయులు, రమేశ్‌చందర్, శ్రీనునాయక్, మేగ్యానాయక్ పాల్గొన్నారు.

మరికల్‌లో..

మరికల్, నవంబర్ 18 : లగచర్లలో జాతీయ ఎస్టీ కమిషన్ పర్యటన సందర్భంగా రాష్ట్ర లంబాడీ హక్కుల పోరాట సమితి పిలుపు మేరకు సోమవారం చలో లగచర్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెళ్లకుండా మరికల్ పోలీసులు ఉదయం గాజులయ్యతండా మాజీ ఉప సర్పంచ్, లంబాడి హక్కుల పోరాట సమితి నేత భాస్కర్ నాయక్‌ను మందస్తూ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ నాయక్ మాట్లాడుతూ గిరిజన భూములు లాక్కొని ఫార్మా కంపెనీని ఏర్పాటు చేయడం సరికాదన్నారు.

సీఎం బాధ్యత వహించాలి

బాలానగర్, నవంబర్ 18 : కొడంగల్ లగచర్లలో ఇటీవల చోటుచేసుకున్న అల్లర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని మాజీ జెడ్పీ టీసీ మోహన్‌నాయక్ అన్నారు. లగచర్ల ఘటనపై సోమవారం ఎస్టీ కమిషన్ గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో జరిగిన ఘటనలో అరెస్టు అయిన గిరిజనులకు మద్దతుగా నిలిచిన బాలానగర్, రాజాపూర్ మండలాలకు చెందిన ఎల్ హెచ్‌పీఎస్ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. రాజాపూర్‌లో మాజీ జెడ్పీ టీసీ మోహన్‌నాయక్, రమేశ్‌నాయక్, రవినాయక్, పాండునాయక్, నర్సింహనాయక్, సురేశ్‌ను ఎస్సై రవి అరెస్టు చేయగా, బాలానగర్ మండలంలో లింగూనాయక్, బాలూనాయక్, గోపీనాయక్, వెంకట్‌నాయక్, తిరుపతి, బిచ్చూనాయక్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

దేవరకద్రలో..

దేవరకద్ర, నవంబర్ 18 : బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు ఆనం డ్యాయక్‌ను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండంగల్ నియోజకవర్గంలోని లగచర్ల బాధితులకు అండగా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటూ గిరిజనులు, దళితులపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యం చేస్తుందన్నారు. అందుకు నిరసనగా లగచర్లలో ఫార్మా విలేజ్ పేరు తో రేవంత్ ప్రభుత్వం బలవంతపు భూసేకరణకు సోమవారం లగచర్లకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు వస్తుండడం తో లగచర్లకు వెళ్లకుండ ఉండేందుకు గానూ ముందస్తుగా ఎస్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేయాడం ఎంతవరకు సమంజసమన్నారు. అనంతరం సాయంత్రం పోలీసులు సొంత పుచికతుపై విడుదల చేశారు.

హన్వాడలో..

హన్వాడ, నవంబర్ 18 : లగచర్ల బాధితులను పరామర్శించేందుకు సోమవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జలోతు హుస్సేన్ రావడంతో ముదస్తుగా హన్వాడ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు హరిచందర్, గిరిజన సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, ఎస్టీ సెల్ మండల కార్యదర్శి నాగేశ్, మాజీ సర్పంచ్ శంకర్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

అరెస్ట్ చేయగా.. భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న గిరిజన నాయకులు

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



నారాయణపేట టౌన్ : అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, నవంబర్ 18 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో కుటుంబ సర్వేపై అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. మండలాల వారీగా సర్వే కొనసాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కొన్ని మండలాల్లో సర్వే ఆలస్యంగా కొనసాగుతుందని, సూపర్‌వైజర్లు వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. సర్వే పూర్తయ్యాక సర్వే ఫారాలను ఎంపీడీవో కార్యాలయాల్లో భద్ర పరచాలని పేర్కొన్నారు. సర్వే ఫారాల డాటాను కంప్యూటర్లలో ఎంట్రీ చేసేందుకు ఆపరేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. సర్వే పూర్తయిన మండలాల్లో డాటా ఎంట్రీ చేయించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బేంషాలం, డీపీవో కృష్ణ, సీపీవో యోగానంద్, మున్సిపల్ కమిషనర్ సునీత, తదితరులు ఉన్నారు.

ఇబ్బందులు కలుగకుండా చూడండి

దామరగిద్ద, నవంబర్ 18 : రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. సోమవారం మండంలోని మల్‌రెడ్డిపల్లి, లోకుర్తి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొను గోలు కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులు తెచ్చిన ధాన్యాన్ని తూకం సరిగ్గా వేయాలని అధికారులకు సూచించారు. ధాన్యంబస్తా లు, టార్పాలిన్ కవర్లు సెంటర్ వద్ద ఉంచుకోవాలని సూచించారు. రైతులు ఆధునిక యంత్రాలు ఉపయోగించి వ్యసాయం చేయాలని రైతుకు సూచించారు. అనంతరం కుల గణన కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిలక్ష్మి, ఐకేపి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబర్ 18 : జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో ఈనెల 19న సాయంత్రం 5:30గంటలకు సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ అలేఖ్య ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలపై డ్యాన్స్ బ్యాలెట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయితెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై రూపొందించిన సంగీత, నాటక, నృత్య, స్క్రిప్ట్‌ను ప్రదర్శించనున్నారని తెలిపారు. శిల్పారామం లో వేదిక, సౌండ్ లైటింగ్, కళాకారులకు బస, భోజన వసతి కార్యక్రమంకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, డీఆర్వో రవికుమార్, జెడ్పీ సీఈవో వెంకటరెడ్డి, మున్సిపల్ మహేశ్వర్‌రెడ్డి, డీపీఆర్వో శ్రీనివాస్, డీఆర్‌డీవో నర్సింహులు, అధికారులు, తదితరులు ఉన్నారు.

మహబూబ్‌నగర్‌లో దొంగల హల్‌చల్

సూపర్ మార్కెట్ షట్టర్స్ విరగ్గొట్టిన దొంగలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 18 : మహబూబ్‌నగర్ పట్టణంలో వరుస దొంగతనాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పట్టణం నడి బొడ్డున ఉన్న ఓ దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు చొరబడి దోరికి నంత దోచుకెళ్లారు. దొంగతనం చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తం కావడంతో దొంగల బరితెగింపును కళ్లకు కట్టింది. జిల్లా కేంద్రం న్యూటౌన్‌లోని హష్మి బ్రదర్స్ మెగా సూపర్ మార్కెట్, హష్మి లగేజ్, అమెరికన్ టూరిస్టర్ షటర్స్‌ను ఓపెన్ చేసి.. లోపలికి ప్రవేశించిన దొంగలు.. దుకాణంలోని క్యాష్ కౌంటర్‌లో ఉన్న నగదును మాత్రమే తీసుకుని ఉడాయించారు. హష్మీ బ్రదర్స్ సూపర్ మార్కెట్ మహబూబ్‌నగర్ డీఎస్పీ, టూటౌన్ పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే అది కూడా ప్రధాన అంతర్రాష్ట్ర రహదారిపై ఉండటం కొసమెరుపు. గత నెలలో మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో 32 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన ఘటన మరిచిపోక ముందే తాజాగా పట్టణ నడిబొడ్డునే మరో చోరీ జరగడం పట్టణ వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

మహిళా శక్తి పథకంపై అవగాహన

మిడ్జిల్ : మహిళలకు కోళ్లను పంపిణీ చేస్తున్న జ్యోతి

ధన్వాడ, నవంబర్ 18 : ఇందిరా క్రాంతి పథకంలో చెపట్టే మహిళా శక్తి పథకంపై సోమవారం ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల అధ్యక్షులకు సీసీ అశోక్ అవగాహన కల్పించారు. మహిళలకు ప్రభుత్వం నుంచి సబ్సిడీతో కూడిన రుణంతో క్యాంటిన్లు, పెరటికోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, తదితర పథకాలకు రుణం ఇస్తుందని, దీని ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం హన్మంతు, సీసీలు అశోక్, సూల్తాన, బుక్ కీపర్ సచిన్ పాల్గొన్నారు.

మహిళల ఉపాధికి కోళ్ల పంపిణీ

మిడ్జిల్, నవంబర్ 18 : పెరిటి కోళ్ల పెంపకంతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతారని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఇందిరా మహిళా శక్తి పథకం అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ-జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో మహిళలుకు కోళ్లను ఉచితంగా అందించారు. పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోళ్లను జాగ్రత్తగా పెంచి ఆర్థికంగా వృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం రాందాసు, మాజీ ఎంపీటీసీ గౌస్, నాయకులు అల్వాల్‌రెడ్డి, పర్వతాలు, జంగయ్య, బాలస్వామి, రాంగౌడ్ పాల్గొన్నారు.

సత్యశోధన పాదయాత్రకు ఘన స్వాగతం

భూత్పూర్, నవంబర్ 18 : విశ్రాంత డీఈవో విజయకుమార్ చేపట్టిన సత్య శోధన పాద యాత్రకు మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ సోమవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్య శోధన పాద యాత్ర చేస్తున్న విశ్రాంత డీఈవో విజయకుమార్‌ను మున్సిపల్ చైర్మన్ శాలువా, పూలమాలతో స్వాగతం పలికారు. అనంతరం పట్టణ కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విజయకుమార్ 70ఏండ్ల వయస్సులో మహాత్మాగాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని 1000కిలో మీటర్ల పాద యాత్రను చేపట్టడం గొప్ప విషయమన్నారు. ఆయన పాద యాత్ర విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివేకానంద విద్యాలయం కరస్పాండెంట్ నర్సింహులు, మాజీ సర్పంచ్ నారాయణ గౌడ్, పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం మండలాధ్యక్షుడు బాలరాజు గౌడ్, సాధిక్, సంజీవరెడ్డి, విజయ్‌గౌడ్, వెంకటయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌకుంట్ల డీటీగా సుజాత

సుజాత

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), నవంబర్ 18 : కౌకుంట్ల మండల డిప్యూటీ తాసీల్దార్‌గా సుజాత బుధవారం విధులలో చేరారు. ఆమె ఇంతకు ముందు జిల్లా ఆర్‌డీవో కార్యాలయంలో విధులు నిర్వహించి, కలెక్టర్ ఆదేశాల మేరకు కౌకుంట్ల డీటీగా చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జూనియర్ అసిస్టెంట్‌గా చక్రపాణి విధుల్లో చేరారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ కేసులు

- ఎస్పీ జానకి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 18: ర్యాగింగ్‌కు పాల్పడేవారిపై క్రిమినల్ కేసులు నమోదవుతాయని ఎస్పీ జానకి తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ర్యాగింగ్‌కు సంబంధించిన చట్టాలు, దాని పర్యవసానాలు, బాధితులకు అందు బాటులో ఉన్న రక్షణ మార్గాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్ వల్ల విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం ఎలా ప్రభావితమవుతుందో వివరించారు. ఎవరైనా ర్యాంగింగ్‌కు గురైనప్పుడు వెంటనే ప్రిన్సిపాల్ లేదా యాంటీ ర్యాగింగ్ కమిటీలకు సమాచారం ఇవ్వాలని, పోలీసు, మహిళా హెల్ప్‌లైన్ నెంబర్లను విని యోగించుకోవాలన్నారు. అనంతరం యాంటీ ర్యాగింగ్ గోడపత్రికలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల డైరెక్టర్ రమేశ్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ రమాదేవి, రూరల్ పోలీసు స్టేషన్ సీఐ గాంధీనాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

నారాయణపేట, నవంబర్ 18 : ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 5 ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ వాటిని చట్టప్రకారం పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత సీఐలు, ఎస్సైలకు ఫోన్‌లో ఆదేశించారు. భూ సంబంధిత సమస్యలు కోర్టు లో పరిష్కరించుకోవాలని ఎస్పీ సూచించారు.

పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 18: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో పీజీ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. రెగ్యూలర్ పీజీ కోర్సు లైన ఎంఏ (తెలుగు), ఎంఎస్సీ జువాలజీ, కెమిస్ట్రీ, మ్యాథ్స్, సబ్జెక్టులో స్పాట్ అడ్మిషన్లకు ఈ నెల 20వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. డిగ్రీ పాసైన విద్యార్థులు, కౌన్సెలింగ్‌కు హాజరు కాని అభ్యర్థులు ఒరి జినల్ సర్టిఫికెట్స్‌తోపాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తీసుకుని నిర్దేశిత గడువులోగా కళాశాలలో సంబంధిత కోర్సు విభాగాధిపతులను కలవాలని పేర్కొన్నారు. వివరాలకు 9640414429నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలి

ఊట్కూర్, నవంబర్ 18 : సెమీ క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని పాస్టర్‌లు జనార్దన్, దేవానందు, రాజు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఎంబీ షాలేమ్ చర్చి ఆధ్వర్యంలో యేసు నామ ధ్యాన మహోత్సవం పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. డిసెంబర్ 10 నుంచి మూడు రోజులపాటు జరిగే సెమీ క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని క్రిస్టియన్లను కోరారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ పీఏసీసీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవాబ్‌పేట, నవంబర్ 18 : మండలంలోని వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్లలో మంగళూరం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు పోమాల్ సబ్‌స్టేషన్‌లోని అమ్మాపూర్ ఫీడర్, కారుకొండ సబ్‌స్టేషన్‌లోని రుద్రారం ఫీడర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, కారూర్‌ఫీడర్‌లో మధ్యాహ్నం 2 నుంచి 6గంటల వరకు, లోకిరేవు సబ్‌స్టేషన్‌లోని ఫీడర్‌లో ఉదయం 9నుంచి ఒంటి గంట వరకు, ఆర్సీ పూర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2నుంచి 6గంటల వరకు మరమ్మతు పనులు చేపడతామన్నారు. వినియోగదారులు గమనించాలని ఏఈ పేర్కొన్నారు.

బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌కు వినతుల వెల్లువ

కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబర్ 18 : సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన బహిరంగ విచారణ సమావేశంలో స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ గుర్తింపు అంశంపై ఉమ్మడి జిల్లా పరిధిలో బహిరంగ విచారణలో భాగంగా బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కమిషన్ కార్యదర్శి సైదులు, కలెక్టర్ విజయేందిరబోయి వివిధ సంఘాల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ, ధర్మసమాజ్ పార్టీ, బీసీ మేధావులు, వ్యవసాయ కార్మిక, ఆల్‌మేవా, యాదవ, సగర, పద్మశాలీ, ఎరుకల, బీఆర్ఎస్ మైనార్టీ విభాగం, ముదిరాజ్ సంఘంతోపాటు వడ్డెర, సంచార జాతుల, విశ్వబ్రాహ్మణ, నాయీబ్రాహ్మణ, విశ్వకర్మ, ముస్లిం, మత్స్యకారుల, ఆలిండియా ఓబీసీ కులాల, పూసల, చాకలి, దూదేకుల, యాదవ, గొల్ల కురుమ, సంచార ముస్లిం, కుమ్మరి, మేదరి, ఎంబీసీ తదితర సంఘాలు, ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలుపుతూ 70 వినతిపత్రాలు అందించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిణి ఇందిర, ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చలాన్లు విధించిన పోలీసులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 18: పట్టణంలోని ప్రధాన రహదారుల్లో సోమవారం ట్రాఫిక్ పోలీసులు ఛలాన్లు విధించారు. నంబర్ ప్లేట్ వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కచ్చితంగా నెంబర్ ప్లేట్ ఉండాల్సిందేనని వాహనదారులకు సూచించారు. త్రిబుల్ రైడింగ్ చేస్తున్న వారికి సైతం కౌన్సెలింగ్ నిర్వహించి చలాను విధించారు. 50 మందికి పైగా వాహనదారులకు చలాన్లు వేశారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

నారాయణపేట, నవంబర్ 18 : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ విజయ్‌కుమార్ పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శిల్ప, భారతి పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌లో..

పాలమూరు, నవంబర్ 18 : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు జిల్లా గ్రంథాలయంలో ఆ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు 'స్వచ్ఛ భారత్' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం శాంతి దేవాలయం అని గ్రంథాల యాల ద్వారానే నైతిక విలువలతో కూడిన బావి భారత పౌరులు తయార వుతాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి : మాజీ ఎమ్మెల్యే ఆల

కురుమూర్తిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, నవంబర్ 18: ప్రమాదంలో, అనారోగ్య సమస్యలతో దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి డాక్టర్లను కోరారు. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మదనాపురం మండలం దుప్పల్లికి చెందిన మాజీ ప్రెసిడెంట్ లక్ష్మన్న, ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన దుప్పల్లి గ్రామానికి చెందిన కురుమూర్తి, న్యూరో సంబంధిత వైద్య సేవలు పొందుతున్న నెలివిడి గ్రామానికి చెందిన బడుగుల రాములు తదితరులను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. నవోదయ, ఎస్వీఎస్ దవాఖానల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న వైద్య సేవలపై వివరాలు ఆరా తీశారు. వారికి అండగా నేనుంటానని భరోసా ఇచ్చారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లను కోరారు. ఆయా కుటుంబాలకు చెందిన వారిలో మనోధైర్యం నింపారు.

విద్యారంగ అభివృద్ధికి నరేందర్ కృషి

ధన్వాడ, నవంబర్ 18 : విద్యారంగం అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి స్కూల్ అసిస్టెంట్ నరేందర్ చేస్తున్న కృషి అభినందనీయమని నారాయణ పేట డీఈవో అబ్దుల్ ఘనీ అన్నారు. సోమవారం నరేందర్, మాధవి పెళ్లి రోజును పురస్కరించుకోని మందిపల్లి తండా విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో గాయత్రి, ఉపాధ్యాయులు నర్సింహాచారీ, రిటైర్డ్ ఉపాధ్యాయులు శెట్టి రమేశ్, శృతి, సౌజన్య పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

మక్తల్, నవంబర్ 18 : మక్తల్ మైనార్టీ గురుకుల పాఠశాల (బాలికల) కళాశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఖాళీ ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దర ఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎలిజబెత్ రాణి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టుకు పీజీటీ ఫిజికల్ సైన్స్ సబ్జెక్టు పోస్టుకు ఆసక్తిగల మహిళా అభ్యర్థుల నుంచి దర ఖాస్తులు కోరుతున్నామని పీజీ, బీఈడీలో 50% కన్నా ఎక్కువ మార్కులు ఉన్నవారు ఈనెల 21వ తేదీలోగా మక్తల్ మైనార్టీ పాఠశాలలో దర ఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి మౌఖిక పరీక్షలు డెమోలు నిర్వహించి వాటి అభ్యర్థులను ఈ పోస్టుకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా మక్తల్ కస్తూర్బా గాంధీ పాఠశాలలో వంట సహకారిని కోసం దరఖాస్తు చేసుకోవాలని మక్తల్ ఎంఈవో అనిల్‌గౌడ్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. 45 సంవత్సరాల లోపు ఉన్న మహిళ అభ్యర్థులు ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ కార్డు, పదో తరగతి మెమోతో మక్తల్ ఎమ్మార్సీ కార్యాలయంలో దర ఖాస్తు చేసుకోవాలన్నారు.

పశుగణన సర్వే ప్రారంభం

మిడ్జిల్, నవంబర్ 18 : మండల కేంద్రం తోపాటు కొత్తపల్లి, బోయిన్‌పల్లి, మున్న నూల్, వేముల, దోనూర్ గ్రామాల్లో పశుగణన సర్వే నిర్వహిస్తున్నామని పశువైద్యాధికారి శివరాజ్ అన్నారు. 21వ అఖిల భారత పశుగణనలో వచ్చే ఎన్యుమరేటర్లకు వివరాలు చెప్పి సహకర